క్లుప్తంగా

నేరేడుచర్ల వాసవీ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక


ఈగా శ్రీనివాస్, అధ్యక్షుడు


కృష్ణసుమంత్, ప్రధాన కార్యదర్శి


వంశీ కృష్ణ, కోశాధికారి

నేరేడుచర్ల : పట్టణంలో శుక్రవారం వాసవీ క్లబ్ సమావేశం క్లబ్ అధ్యక్షుడు గెల్లి లక్ష్మీనర్సింహారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా 2025 సంవత్సరానికి గాను నేరేడుచర్ల వాసవీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్లబ్ అధ్యక్షుడిగా ఈగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా అయితకృష్ణసుమంత్, కోశాధికారిగా నకిరేకంటి వంశీకృష్ణ, సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం వాసవీ క్లబ్ గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి.. కార్యవర్గ సభ్యులకు నియామకపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ ప్రధాన కార్యదర్శి జూలూరి అశోక్, కోశాధికారి తాళ్లూరి శ్రీనివాస్, జోన్ చైర్మన్ కొత్త లక్ష్మణ్, సభ్యులు కందిబండ శ్రీనివాస్, తడకమళ్ల స్వామి, గోళ్ల సుధాకర్, కట్టమూరి మధు, రాచకొండ రవికుమార్, చంద కిషన్, మురారిశెట్టి రమేష్ తదితరులు ఉన్నారు.

నారయ్యకు డాక్టరేట్



హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన రాయిరాల శౌరి, శాంతమ్మ కుమారుడు రాయిరాల నారయ్యకు ఉస్మానియ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. నారయ్య ఈసీఈ విభాగంలో పీహెచ్‌డీ పూర్తిచేశాడు. ప్రొఫెసర్ పెరుమాళ్ల నవీన్‌కుమార్ పర్యవేక్షణలో ఇన్వెస్టిగేషన్ అండ్ ఎనాలిసిస్ ఆఫ్ మల్టీపాత్ ఎఫెక్ట్స్ ఆన్ నావిక్ ఓవర్ ఇండియన్ రీజియన్ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఆయనకు డాక్టరేట్ వచ్చింది. దీంతో పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ టోర్నమెంటుకు ఎంపిక


రాష్ట్ర స్థాయి టోర్నమెంటుకు ఎంపికైన క్రీడాకారులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండల కేంద్రానికి చెందిన నలుగురు క్రీడాకారులు రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ టోర్నమెంటుకు ఎంపికైనట్లు జై హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మోర్తాల నాగిరెడ్డి శుక్రవారం తెలిపారు. జనగామలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు జరిగే 50వ రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ టోర్నమెంటులో జై హనుమాన్ స్పోర్ట్స్ క్లబ్ క్రీడాకారులు మాలావత్ రాముడు, బత్తుల రవితేజ, బాణావత్ సైదులు, షేక్ జావిద్ పాల్గొనను న్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వీరికి పలువురు గ్రామస్తులు, క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు


ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందిన క్రీడాకారులతో నిర్వాహకులు

హుజూర్‌నగర్ : క్రిస్మస్ సందర్భంగా హుజూర్‌నగర్‌లోని గోవిందపురంలో అంబేద్కర్ లయన్స్, మహాత్మా జ్యోతిరావు పూలే సంఘాల ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న మున్సిపల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం ముగిసాయి. ఈ పోటీలలో మొత్తం పది టీమ్‌ల క్రీడాకారులు పాల్గొన్నారు. సామరాజు మొదటి బహుమతి, ద్వితీయ బహుమతి కోలనాగేశ్వరరావు టీమ్‌లు గెలుపొందాయి. విజేతలను క్రీడల కమిటీ చైర్మన్ భాస్కర్ అభినందించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ ధనుంజయ్, కౌన్సిలర్ సౌజన్య ధనుంజయ, అంపైర్ బి.వినోద్‌కుమార్, నిర్వాహకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

హుజూర్‌నగర్ : రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్యగౌడ్ కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రోడ్లపై వేగ నియంత్రణ సూచిక బోర్డులు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. మండలంలోని గోపాలపురం నుంచి బూరుగడ్డకు యూటర్న్ తీసుకునే ప్రాంతంలో వేగ నియంత్రణ, ప్రమాద సూచిక బోర్డులు లేకపోవడంతో ఇద్దరు యువకులు ప్రాణాలు పోగొట్టుకున్నారని తెలిపారు. ఇప్పటికైనా నేషనల్ హైవే, పోలీస్ అధికారులు జాతీయ రహదారిపై వేగ నియంత్రణ సూచిక బోర్డులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అధ్వాన రోడ్డుపై ప్రయాణించేదెలా..

- కంకర తేలిన ఆర్లెగూడెం రోడ్డు
- రహదారికి ఇరుపక్కల ఆక్రమణ
- రాకపోకలకు ఇబ్బందులు
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు


అధ్వానంగా చిలుకూరు నుంచి ఆర్లెగూడెం వెళ్లే రోడ్డు


చిలుకూరు చెరువు వద్ద ఇలా..

చిలుకూరు : మండల కేంద్రం నుంచి ఆర్లెగూడెం మీదుగా కొత్త కొండాపురం వరకు గల కంకర రోడ్డు అధ్వానంగా తయారైంది. సుమారు మూడు కిలోమీటర్లు మేర ఉన్న ఈ రోడ్డు కంకర తేలి ప్రమాదకరంగా మారింది. అంతేకాకుండా రోడ్డుకు ఇరుపక్కల ఆక్రమించడంతో ఇరుకుగా మారింది. దీంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు వాహనం రోడ్డు కిందకు వెళ్లే స్థలం కూడా లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో వ్యవసాయ పొలాలు ఉన్న రైతులకు వరి నాట్లు, కోతల సమయంలో ట్రాక్టర్ల రాకపోకలకు తిప్పలు తప్పడం లేదు. చిలుకూరు నుంచి ఆర్లెగూడెం, కొత్త కొండాపురం మీదుగా ముక్త్యాల బ్రాంచ్ కెనాల్, పాత కొండాపురం, మాధవగూడెం గ్రామాలకు ఈ రోడ్డుపై నుంచే రైతులు, ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు.

నిత్యం నరకయాతన..

ఆర్లెగూడెం రోడ్డు వెంట చిలుకూరు, ఆర్లెగూడెం, పాత కొండాపురం గ్రామాలకు చెందిన రైతుల పొలాలు ఉన్నాయి. ఈ దారి గుండా రైతులు నిత్యం తమ పొలాలకు ఎరువుల బస్తాలు తీసుకెళ్లడం, పొలాల నుంచి ఇళ్లకు పచ్చిగడ్డి మోపులు తీసుకొస్తుంటారు. కానీ రోడ్డుపై ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొనడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. వరి నాట్లు, వరి కోతల సమయంలో ట్రాక్టర్లు, వరి కోత మిషన్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వేడుకుంటున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



చిలుకూరు నుంచి ఆర్లెగూడెం వరకు గల కంకర రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డులో ప్రయాణించాలంటే రైతులం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు, నాయకులకు విన్నవించినా ప్రయోజనం లేదు. ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మతులు చేయాలి. – పిల్లుట్ల రమేష్, రైతు, చిలుకూరు

దొడ్డు యూరియా అందించాలని ఆందోళన

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలంలోని అమరవరంలో గల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఎదుట పలువురు రైతులు దొడ్డు యూరియా అందించాలని శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దొడ్డు యూరియాను కొందరికి మాత్రమే ఇస్తున్నారని, చిన్న, సన్నకారు రైతులకు సన్న యూరియా ఇస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. క్యూలైన్‌లో నిల్చున్న రైతులకు కాకుండా పలుకుబడి ఉన్న రైతులకు మాత్రమే దొడ్డు యూరియా ఇస్తున్నారని, సంబంధిత అధికారులు స్పందించి రైతులందరికీ యూరియాను సమానంగా పంపిణీ చేసేలా చూడాలని వారు కోరారు.


యూరియా కోసం క్యూలైన్‌లో నిల్చున్న రైతులు

విలీన సభ పోస్టర్ ఆవిష్కరణ

కోదాడరూరల్ : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవన్‌లో ఈ నెల 28న జరిగే సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ విలీన సభను విజయవంతం చేయాలని అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి కోరారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని లాల్ బంగ్లా ఎదుట విలీన సభ పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నుంచి కాలక్రమేణ చీలిన వారందరూ విలీనం కావాల్సిన అవసరం ఉందన్నారు. చీలకలతో ప్రజా ఉద్యమాలకు నష్టం జరుగుతుందని, దోపిడీ వ్యవస్థను అంతం చేసే సమాజం కోసం విప్లవకారులు చీలిపోవద్దని కోరారు. భారతదేశంలో బలమైన విప్లవ ఉద్యమ నిర్మాణానికి ఎంఎల్ నుంచి చీలిపోయిన రెండు పార్టీలు ఒకటి కావడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి వి.నరసింహారావు, రైతు కూలీ సంఘం నాయకులు అలుగుబెల్లి సత్యనారాయణరెడ్డి, డి.వేణు, పోకల మైసయ్య, రామారావు, నరసింహారావు, ఖాసీం, కొండయ్య తదితరులు ఉన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

గ్రామ పంచాయతీ కార్మికుల నిరసన


మేళ్లచెరువులో ప్రధాన రోడ్డుపై నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

మేళ్లచెరువు : తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై గ్రామపంచాయతీ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వట్టెపు సైదులు మాట్లాడుతూ.. పంచాయతీ సిబ్బందికి గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని, జీఓ నంబర్ 60 ద్వారా వేతనాలు కేటగిరీల వారీగా చెల్లించడంతో పాటు మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి, సైదులు, అశోక్, నరేష్, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు, సైదులు, ఉప్పలమ్మ, కోటయ్య, శ్రీను, కిరణ్, సుధాకర్, భూలక్ష్మి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

గరిడేపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికులు కోరారు. ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోకపోవడంపై సీఐటీయూ పిలుపుమేరకు శుక్రవారం గరిడేపల్లి మండల కేంద్రంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. కార్మికులకు ఏడాదికి రెండు జతల యూనిఫామ్ అందజేయాలన్నారు. అనంతరం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గోపగాని సత్యం, రావుల వెంకన్న, కొండ సైదులు, వెంకన్న, రవి, నాగచారి, మహేష్, ప్రవీణ్, బాలు, రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

మోతె : గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు కోరారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ పిలుపుమేరకు శుక్రవారం మోతె మండల కేంద్రంలో జరిగిన టోకెన్ సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులకు పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్టాల రవిచంద్ర, పి.లక్ష్మీనారాయణ, నాగమణి, శాంత, చాంది, మల్లయ్య, వీరయ్య, సాలయ్య, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.


గరిడేపల్లి : మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు


మోతెలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్మికులు

శ్రీవేణుగోపాలస్వామికి గరుడవాహన సేవ


గరుడవాహన సేవలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్ : ధనుర్మాసం సందర్భంగా పట్టణంలోని శ్రీవేణుగోపాల, శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో శుక్రవారం రుక్మిణి సత్యభామ సమేతంగా శ్రీవేణుగోపాలస్వామి మూలమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. పాశుర పఠనం గావించారు. అనంతరం గరుడ వాహన సేవ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారులు, ఆలయ ఈఓ, భక్తులు పాల్గొన్నారు.

నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం


కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం రాశులు

నడిగూడెం : మండలంలోని నారాయణపురంలో గల ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో నెల రోజులుగా ధాన్యం కాంటాలకు నోచుకోవడం లేదు. నారాయణపురం, సిరిపురం గ్రామాలకు చెందిన అనేక మంది రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చారు. దాదాపు రెండు లారీల లోడుకు పైగా ధాన్యం నిల్వ ఉంది. నిబంధనల ప్రకారం తేమ శాతం ఉన్నా అధికారులు కాంటాలు వేయడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే కాంటాలు వేయాలని రైతులు కోరుతున్నారు.

అసమానతల నిర్మూలన దినోత్సవం

నడిగూడెం : మండల కేంద్రంలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం జై భారత్ ఆధ్వర్యంలో అసమానతల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నోసిన కోటయ్య, నాయకులు చల్లా సతీష్, కె.నాగయ్య, లక్ష్మీప్రసన్న, స్వాతి, సావిత్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోరాటంలో రంగాపురం గ్రామానిది కీలక పాత్ర


సీపీఐ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

గరిడేపల్లి : తెలంగాణ సాయుధ పోరాటంలో రంగాపురం గ్రామం కీలక పాత్ర పోషించిందని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం గరిడేపల్లి మండలంలోని రంగాపురం గ్రామంలో నిర్వహించిన సీపీఐ ఆవిర్భవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. సాయుధ పోరాటంలో రంగాపురం పాత్ర గురించి పుస్తకాల్లో చరిత్ర నిక్షిప్తమై ఉందని అన్నారు. లక్షలాది మంది వీరుల త్యాగాల ఫలితంగానే సీపీఐ వంద సంవత్సరాల వేడుకలు నిర్వహించుకుంటున్నామని తెలిపారు. నల్లగొండలో ఈ నెల 30న జరిగే సీపీఐ వంద సంవత్సరాల వేడుకలకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ గ్రామ కార్యదర్శి తిరగమళ్ల కిరణ్, కట్టా అశోక్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి మెండె లింగరాజు, బాలశౌరి సతీష్, నవీన్, రాయప్ప, నాగులు, రాజశేఖర్, బాబు, వీరబాబు, యల్లయ్య, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కోదాడరూరల్ : సీఎం సహాయ నిధి నుంచి కోదాడ మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన ఇంటి సుబ్బమ్మకు రూ.52 వేలు, జక్కంపూడి కల్యాణికి రూ.16వేలు మంజూరయ్యాయి. శుక్రవారం స్థానిక నాయకులు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇర్ల సీతారాంరెడ్డి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు జాబిశెట్టి నాగప్రసాద్, ఉపాధ్యక్షుడు బండి చిన్నకోటయ్య, సింగారెడ్డి సుమన్‌రెడ్డి, ఇర్ల నారపరెడ్డి, కొండా నరసింహారావు, ఇర్ల శౌరెడ్డి, ఇర్ల లక్ష్మారెడ్డి, కొలిశెట్టి వెంకన్న, నాగేశ్వరరావు, రవి ఉన్నారు.

ఇసుక తరలిస్తున్న టిప్పర్లు సీజ్

మేళ్లచెరువు : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను పోలీసులు సీజ్ చేశారు. శుక్రవారం ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలం పరిధిలోని మంగళికుంటతండా వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్లను పట్టుకొని సీజ్ చేసి యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మన్మోహన్‌సింగ్ సేవలు భరతజాతి మరువదు


కోదాడ : ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు


హుజూర్‌నగర్ : మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కోదాడ : దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఆర్‌బీఐ గవర్నర్‌గా, ఆర్థిక మంత్రిగా, ప్రధాన మంత్రిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ చేసిన సేవలు భరత జాతి ఎప్పటికీ మరువదని పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు. శుక్రవారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దివంగత మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవేటి రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, పారా సీతయ్య, ముత్తవరపు పాండు రంగారావు, కందుల కోటేశ్వరరావు, గంధం యాదగిరి, పెండెం వెంకటేశ్వర్లు, షాబుద్దీన్, సైదిబాబు, గంధం పాండు, డేగ శ్రీధర్, ముస్తఫా, నిరంజన్‌రెడ్డి, కట్టెబోయిన శ్రీను, కర్రి సుబ్బారావు, బాగ్దాద్, బాజాన్, పిడతల శ్రీను, కాంపాటి శ్రీను, దేవమణి తదితరులు పాల్గొన్నారు.

తేజ టాలెంట్ స్కూల్‌లో..

మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని తేజ టాలెంట్ పాఠశాల ప్రిన్సిపాల్ అప్పారావు, కరస్పాండెంట్ జానకిరామయ్య, సెక్రటరీ సంతోష్‌కుమార్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటు

హుజూర్‌నగర్ : మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి దేశానికి తీరని లోటని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాముల శివారెడ్డి, అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని ఇందిరా భవన్‌లో పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు.. మన్మోహన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జక్కుల వీరయ్య, తేజావత్ రాజా, మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు అజీజ్‌పాషా, అమర్‌నాథ్‌రెడ్డి, ఎస్.సైదులు, సావిత్రి, జె.మల్లయ్య, ఎం.సత్యనారాయణ, జ్ఞానయ్య, రాము, వీరబాబు, కె.ఉపేందర్, శివ, తదితరులు పాల్గొన్నారు.

మునగాల : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి భారత దేశానికి తీరని లోటని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గణపవరం క్రాస్ రోడ్డులో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఎలక నరేందర్‌రెడ్డి, కాసర్ల కోటేశ్వరరావు, చింతకాయల ఉపేందర్, కొమ్ము ఈదారావు, దేవినేని నాగేశ్వరరావు, దేవినేని రవి, వేసేపల్లి వీరబాబు, కుక్కడపు లక్ష్మయ్య, పిచ్చయ్య, నరసింహారావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాయి పాల్గొన్నారు.


మునగాలలో ..

నారాయణగూడెంలో..

మండల పరిధిలోని నారాయణగూడెంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సారెడ్డి నరేందర్‌రెడ్డి, పల్లె విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ మృతి బాధాకరం

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి బాధాకరమని స్థానిక హరిహరసుత అయ్యప్ప దేవాలయ పూజారి నరమనేని రామారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి

చిలుకూరు : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల చిలుకూరు మండలానికి చెందిన కాంగ్రెస్, సీపీఐ పార్టీ నాయకులు సంతాపం తెలిపారు. శుక్రవారం చిలుకూరు మండల కేంద్రంలోని బాపూజీ శాఖా గ్రంథాలయంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశం ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, కాంగ్రెస్, సీపీఐ నాయకులు సొందుమియా, సాహెబ్ అలీ, చిలువేరు ఆంజనేయులు, గంగిరెడ్డి నాగిరెడ్డి, కొడారు బాబు, గంగిరెడ్డి సైదిరెడ్డి, పిల్లుట్ల కనకయ్య, కస్తూరి సైదులు, సురగాని యాదగిరి, సిరాపురపు శ్రీనివాస్‌రావు, చేపూరి కొండలు, కొండా నరేష్, సిరాపురపు భిక్షం, పిల్లుట్ల రమేష్, బద్రంరాజు పిచ్చయ్య, గోగుల భద్రయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని జానకీనగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మన్మోహన్ సింగ్ చిత్రటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మన్మోహన్ సింగ్ సేవలు మరువలేనివి

మన్మోహన్‌సింగ్‌కు భారతరత్న ఇచ్చి గౌరవించుకోవాలి

కోదాడ : ఆర్థిక సంస్కరణల సాధకుడు, ఆర్థిక మార్గదర్శి మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని, ఆయనకు భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించుకోవాలని కోదాడకు చెందిన ఆర్థిక విశ్లేషకుడు బడుగుల సైదులు ఒక ప్రకటనలో కోరారు. దేశం ఆర్థికంగా దివాల స్థితి నుంచి నేడు ప్రపంచాన్ని శాసించే ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి నాడు ఆర్థికమంత్రిగా, ప్రధానిగా మన్మోహన్ చేసిన కృషియే కారణమని తెలిపారు. 1991లో ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని పురోగమన దిశగా పయనించే విధంగా చేశాడని పేర్కొన్నారు. లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ విధానాలతో నేడు మన యువత ప్రపంచ వ్యాప్తంగా ఉపాధి పొందుతుందని ఆయన తెలిపారు. ఆయన ముందు చూపే.. నేడు భారతదేశం ప్రపంచంలో మూడో ఆర్థికవ్యవస్థగా మారడానికి కారణమైందని పేర్కొన్నారు.

నడిగూడెం : దేశానికి భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చేసిన సేవలు మరువలేనివని పలువురు కాంగ్రెస్ నాయకులు అన్నారు. మన్మోహన్ సింగ్ మృతి పట్ల శుక్రవారం నడిగూడెం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, స్థానిక మాజీ ఎంపీటీసీ సభ్యుడు గుండు శ్రీనివాస్, నాయకులు పందిరి వెంకటరెడ్డి, గుండు శ్రీను, మొక్క భిక్షపతి, పల్లపు శ్రీనివాస్, బాణాల నాగరాజు, కాసాని వెంకన్న నేలమర్రి సురేష్, గుండు మహేందర్, కాసాని గోపీనాథ్ పాల్గొన్నారు.

మోతెలో..

మోతె : మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ మోతె మండల నాయకులు అన్నారు. శుక్రవారం మోతె మండల కేంద్రంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గణపవరంలో..

కోదాడరూరల్ : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. మన్మోహన్‌సింగ్ మృతి పట్ల శుక్రవారం మండలంలోని గణపవరంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు ఇర్ల సీతారాంరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రేవూరి వెంకటాచారి, అమరనేని వెంకటేశ్వరరావు, ఇర్ల లక్ష్మారెడ్డి, సింగారెడ్డి సుమన్‌రెడ్డి, చిట్టా రాంరెడ్డి, ఇర్ల నారపరెడ్డి తదితరులు ఉన్నారు.


మోతెలో..


నడిగూడెంలో..


చిలుకూరులో


చిలుకూరు : జానకీనగర్‌లో


కోదాడ : తేజ టాలెంట్ స్కూల్‌లో

బూరుగడ్డ ఆలయంలో ప్రత్యేక పూజలు

హుజూర్‌నగర్‌రూరల్ : ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆది వరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, సేవాకాలం, ఆరాధన, మంగళాశాసనం, గోదాదేవికి పంచామృతాలతో అభిషేకం, అనంతరం పల్లకీసేవ, ఆరగింపు, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, ఆలయ చైర్మన్ యరగాని గురవయ్యగౌడ్, ఈఓ ఎంపి లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న నాగన్నగౌడ్ తదితరులు

'ఎర్రోళ్ల' అరెస్ట్ పాశవిక చర్య

హుజూర్‌నగర్‌రూరల్ : తెలంగాణ ఉద్యకారుడు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అరెస్ట్ కాంగ్రెస్ ప్రభుత్వ పాశవిక చర్య అని మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలు, అరాచకాలను ప్రశ్నిస్తున్నందుకు కక్షగట్టి కుట్రపూరితంగా అక్రమ కేసులతో వేధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.